సాక్షి
పార్వతీపురం మన్యం
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

రాజాం బస్టాండ్ ఆవరణలో నవదుర్గ అమ్మవారి ఆలయం వద్ద బాలుడు తప్పిపోయి సుమారు గంట కాలం పాటు పోలీసులు, తల్లిదండ్రులకు కంగారెత్తించాడు. - 8లో



ఏపీఎస్ఆర్టీసీ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా అప్పారావు

ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోనల్ వర్కుషాపులో పని చేస్తున్న డి.అప్పారావు వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. - 8లో

మైనారిటీ సంక్షేమాధికారిగా లావణ్య



విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిగా ఎం.లావణ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం తహసీల్దార్‌గా పనిచేసిన లావణ్య పదోన్నతిపై జిల్లా మైనారిటీ సంక్షేమాధికారిగా నియామకమయ్యారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఉపాధి లక్ష్యం.. కోటి పనిదినాలు



పార్వతీపురంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న వేతనదారులు

- ఇప్పటికే 91 లక్షల పనిదినాల కల్పన
- 'ఉపాధి' పథకానికి పెరుగుతున్న ఆదరణ
- పూడికల తీత, మొక్కల పెంపకానికి ప్రాధాన్యం
- వేతనాల రూపంలో రూ.180.01 కోట్ల చెల్లింపు

జిల్లాలో 'ఉపాధి' కల్పన ఇలా..

మండలాలు	15
గ్రామ పంచాయతీలు	452
మంజూరు చేసిన జాబ్ కార్డులు	2.70 లక్షలు
వేతనదారుల సంఖ్య	4.96 లక్షలు
పనులను సద్వినియోగం చేసుకున్న వారు	3.64 లక్షలు
వేతనాల రూపంలో చెల్లించిన మొత్తం	రూ.180.01 కోట్లు

పార్వతీపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులకు కల్పతరువుగా మారుతోంది. ఉన్న ఊరిలో 'ఉపాధి'చూపుతోంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే జాబ్‌కార్డు, పనులు చూపిస్తుండడంతో పనులకు వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. దీంతో జిల్లాలో కోటి పనిదినాల కల్పనే లక్ష్యంగా ఉపాధిహామీ అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఇందులో ఇప్పటికే 91 లక్షల పనిదినాలు కల్పించి పార్వతీపురం మన్యం జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిపారు.

జిల్లాలో ఇలా...

పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా 452 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2.70 లక్షల జాబ్ కార్డులు మంజూరు చేశారు. ఇందులో 4.96 లక్షల మంది వేతనదారులుగా నమోదయ్యారు. 3.64 లక్షల మంది పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కోటి పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, 91లక్షల పనిదినాలు కల్పించి 91 శాతం లక్ష్యానికి చేరుకున్నారు. పనులు పూర్తయిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేస్తుండడం, అవి త్వరితగతిన మంజూరవుతుండంతో వేతన జీవులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకూ రూ.180.01 కోట్లను వేతనదారులకు వేతనాల రూపంలో చెల్లించినట్టు డ్వామా అధికారులు తెలియజేశారు. ఉపాధిహామీ పనులకు వచ్చే వేతనదారులకు సగటున రోజువారీ వేతనం రూ.219 అందుతోంది.

రూ.756 కోట్లతో కొత్తగా 32,400 పనుల గుర్తింపు

2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనుల జాబితాను డ్వామా అధికారులు రూపొందించారు. వచ్చే ఏడాది 1.23 కోట్ల పనిదినాల కల్పనే లక్ష్యంగా నిర్దేశించారు. వేతనదారుల డిమాండ్‌కు అనుగుణంగా గ్రామానికి ఏ మేరకు పనిదినాలు కల్పించాలన్న అంశంపై కసరత్తు పూర్తిచేశారు. రూ.756 కోట్లతో కొత్తగా 32,400 పనులను గుర్తించారు.. ప్రధానంగా మెట్టప్రాంతాల్లో నీటి నిల్వచేసే పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఫారంపాండ్ల నిర్మాణంపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. ఈ నెలాఖరుకు ప్రణాళికలు రూపొందించి కేంద్రం అనుమతి పొందేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించారు.

నిబంధనలకు అనుగుణంగా..

ఉపాధిహామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం నూతన సంస్కరణలకు నాంది పలికింది. పనుల గుర్తంపు, చేపట్టడం, పర్యవేక్షణకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించింది. పనులు పూర్తయిన అనంతరం వేతనదాలరు వేతనాలతో పాటు అన్నిరకాల బిల్లులనూ సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇవన్నీ పూర్తయ్యాక వేతనదారుల బ్యాంకు ఖాతాలకు ప్రభుత్వం వేతనాలు జమ చేస్తోంది. రోజుకు రెండు పాస్ ఫొటోలు అప్‌లోడ్ చేయాలనే నిబంధన తీసుకు వచ్చారు. ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం 5 గంటలకు మరోసారి రిజిస్టర్‌లో ప్రతివేతనదారులు సంతకం చేయాలనే నిబంధన ఉంది.

మంచి ఆదరణ



ఉపాధిహామీ పథకానికి ఆదరణ పెరుగుతోంది. వ్యవసాయ పనులు సమయంలోనూ ఉపాధిహామీ పనులకు వస్తున్న వారి సంఖ్య తగ్గడంలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అడిగిన వారందదరికీ పనులు చూపుతున్నాం. జాబ్ కార్డులు సైతం సకాలంలో మంజూరు చేస్తున్నాం. ఫలితంగా వేతనదారుల శాతం పెరిగి రాష్ట్రంలో ముందజలో ఉన్నాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇదే స్ఫూర్తితో పనిచేస్తాం.

– రామచంద్రరావు, డ్వామా పీడీ, పార్వతీపురం మన్యం జిల్లా

న్యూస్‌రీల్

యేసు లోకరక్షకుడు



క్రైస్తవ ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి, తదితరులు

సీతంపేట: యేసు లోకరక్షకుడని పాలకొండ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. కడగండి పంచాయతీ సంతవలసలో శుక్రవారం ప్రారంభమైన యేసుక్రీస్తు ఉజ్జీవమహాసభలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోటి వ్యక్తులపై కరుణ, ప్రేమ, జాలి కలిగి ఉండడమే ఆ ప్రభువు సమాజానికి చూపిన మార్గమన్నారు. ఆయన బోధనలు మానవజాతికి సన్మార్గాలుగా పేర్కొన్నారు. ఆమెకు క్రైస్తవ పెద్దలు దీవెనలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్.లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, పార్టీ నాయకులు ఎస్.రాము, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుతో ఆదాయం బాగు



మాట్లాడుతున్న సహాయ సంచాలకుడు సురేష్‌కుమార్

సీతంపేట: చిరుధాన్యాల సాగుతో రైతులకు ఆదాయం బాగుంటుందని చింతపల్లి సహ పరిశోధనా స్థానం సహాయ సంచాలకుడు ఎం.సురేష్‌కుమార్ అన్నారు. చిరుధాన్యాల సంవత్సరం–2023 సందర్భంగా మండలంలోని పెదరామ గ్రామంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఏ పంటలు సాగుచేస్తే ఎంత ఆదాయం వస్తుందనేది తెలియజేశారు. ఇకపై మన్యం రైతులు వీటి సాగుపై దృష్టి సారించాలన్నారు. రాగులు శ్రీ చైతన్యం వీఆర్–847 రకం విత్తనాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పి.సీతారాం,ఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్‌అదాలత్

పార్వతీపురంటౌన్: జిల్లా కోర్టు ప్రాంగణంలో ఈ నెల 11 (శనివారం)న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.ధామోదరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, క్రిమినల్ కేసుల కక్షిదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కేసుల పరిష్కారానికి రాజీమార్గమే ఉత్తమమని, కేసులు పరిష్కరించుకుని డబ్బు, సమయం ఆదా చేసుకోవాలని కోరారు.

పామాయిల్ తోటలు ధ్వంసం



పామాయిల్, అరటి చెట్లను తినేస్తున్న ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని మనుమకొండ–కొత్తూరుగూడ మధ్యలోని పామాయిల్ తోటలను ఏనుగుల గుంపు శుక్రవారం ధ్వంసం చేశాయి. పామాయిల్ మొక్కలను పీకలను కొరికి తినేశాయి. డ్రిప్ ఇరిగేషన్ పైపులను పాడుచేశాయి. అరటి.మొక్కజొన్న పంటలను నాశనం చేస్తుండడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఏనుగుల నుంచి రక్షణ కల్పించాలని అటవీశాఖ అధికారులను కోరుతున్నారు.

ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోండి

పార్వతీపురం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని డీఈఓ ఎస్‌డీవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎంఎంఎస్ పరీక్షకు హాజరైన విద్యార్థులు ఫిబ్రవరి 20లోగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు 7వ తరగతి మార్కుల పత్రం, దివ్యాంగులు సదరం ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలన్నారు.

శతశాతం ఇంటి పన్ను వసూలు చేయాలి



శివరాంపురంలో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న డీపీఓ సత్యనారాయణ

సాలూరు: జిల్లాలో ఈ నెలాఖరులోగా శతశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీరాజ్ అధికారి బి.సత్యనారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలం నుంచి లభించిన ప్లాస్టిక్ వ్యర్థాలను నెలకోసారి వీరఘట్టం ప్లాస్టిక్ సెంటర్‌కు తరలించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాలు, ఎస్‌డబ్ల్యూపీసీ సెంటర్ల పనితీరు తదితర అంశాలపై చర్చించారు. శివరాంపురం గ్రామంలో పర్యటించి రైతుల వద్ద ఉన్న ధాన్యం వివరాలను సేకరించారు.

ఓహెచ్‌సీను సందర్శించిన జేసీ



కాట్రగడ–బి ఓపెన్ హెడ్ చానల్ పరిశీలిస్తున్న జేసీ నవీన్‌కుమార్

భామిని: భామిని మండలం కాట్రగడ–బి వద్ద వంశధార నది ఓపెన్‌హెడ్ చానల్‌ను శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోలతిరుమలరావుతో కలిసి ఓపెన్ హెడ్ చానల్, సైడ్‌వియ్యర్, హెడ్ రెగ్యులేటర్‌లను సందర్శించి పనితీరు తెలుసుకున్నారు. ఓహెచ్‌సీ మ్యాప్‌లను గుర్తించారు. వంశధార నదిలో వరద నీరు వస్తే నేరుగా ఓహెచ్‌సీలోకి ప్రవేశించే విధానాన్ని అడిగితెలుసుకున్నారు. అనంతరం నేరడి–బ్యారేజ్ నిర్మాణ స్థలం పరిశీలించారు. ఆయన వెంట ఈఈ రామచంద్రమూర్తి, కాంట్రాక్టర్ ప్రతినిధి రవీంద్రబాబు ఉన్నారు.

అదనపు పరిహారం కోసం వినతి

వంశధార ప్రాజెక్టు వరద కాలువలో భూములు కోల్పోయిన రైతులకు అదనపు పరిహారం అందజేయాలని శ్రీకాకుళం జిల్లా జాయింట్ కలెక్టర్ నవీన్ కుమార్‌కు ఘనసర రైతులు విన్నవించారు. ఘనసరలో వంశధార ప్రాజెక్టు ఎస్ఈ డోల తిరుమలరావుతో కలిసి పిల్లకాలువల నిర్మాణానికి అవసరమైన భూములను పరిశీలించారు. రైతుల వినతులను పరిగణనలోకి తీసుకోవాలని అధికారులను జేసీ ఆదేశించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

పార్వతీపురం: ఎన్నికల ప్రవర్తన నియమావళిని పక్కాగా పాటించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల కమిషన్ ఈ నెల 9న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలకు షెడ్యూల్ జారీ చేసిందన్నారు. బరిలో నిలిచే అభ్యర్థులు, రాజకీయ ప్రతినిధులు ఎన్నికల నియమావళిని తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. పోలింగ్ సజావుగా జరిగేందుకు తోడ్పడాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన వీసీ



జేఎన్‌టీయూ జీవీ వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య శుక్రవారం బాధ్యతలు స్వీరించారు. ఇంతవరకు వీసీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న జేఎన్‌టీయూ కాకినాడ వీసీ ప్రొఫెసర్ జీవీఎస్‌ప్రసాదరాజు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఆయనకు వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం వీసీ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన వర్సిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. వీసీని కలిసి అభినందనలు తెలిపిన వారిలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు, వర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ కె.బాబు, ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ రాజేశ్వరరావు, ప్రొఫెసర్ కేసీబీరావు, ప్రొఫెసర్ జి.జయసుమ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.గురునాథ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వీఎస్ వకుళ తదితరులు పాల్గొన్నారు.

మన్యం అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



కేంద్ర సంస్థలకు పంపించే లేఖలపై సంతకం చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికోసం నిరంతరం కృషిచేస్తున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. స్థానిక విలేకరులతో ఆయన శుక్రవారం మాట్లాడారు. జిల్లాలోని వనరులు, అభివృద్ధి అవకాశాలను వివరిస్తూ కేంద్ర ప్రభుత్వ సంస్థలకు లేఖలు రాశామన్నారు. జిల్లా కేంద్రంలో ప్రసార భారతి వారి ఆల్ ఇండియా రేడియో సేవలను విస్తృతం చేయడంతో పాటు లోకల్ ఎఫ్ఎం రేడియో కేంద్రాన్ని ఏర్పాటు చేసి గిరిజన కళలను ప్రోత్సహించాలని కోరామన్నారు. భారతీయ స్టేట్‌బ్యాంకు వారి రీజనల్ బిజినెస్ కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేసినట్టు వెల్లడించారు. పార్వతీపురం టౌన్, బెలగాం రైల్వే స్టేషన్ల మీదుగా వెళ్తున్న 28 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ సదుపాయం కల్పించాలని ఈస్టుకోస్ట్ రైల్వే చీఫ్‌కు విన్నవించామన్నారు.

ఇద్దరు ఉపాధ్యాయులపై వేటు

- మధ్యాహ్నభోజన ఏజెన్సీ రద్దు

మక్కువ: మండలంలోని కోన యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయకుమార్, టేస్టింగ్ ఇన్‌చార్జిగా వ్యవహరించిన ఉపాధ్యాయుడు సూరిబాబును సస్పెండ్ చేస్తూ డీఈఓ ఎస్‌డీవీ రమణ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉడికీ, ఉడకని వెజిబిరియానీ తినడంతో పాఠశాలకు చెందిన 38 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఇన్‌చార్జి డీఈఓ బ్రహ్మాజీరావు ఈ ఘటనపై విచారణ జరిపి నివేదికను డీఈఓకు అందించారు. ఆ మేరకు ఇద్దరు ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడంతో పాటు ఎంఈఓ మల్లేశ్వరరావుకు షోకాజ్ నోటీస్ ఇచ్చారు. ఎండీఎం ఏజెన్సీ రద్దు చేస్తూ, కొత్తగా ఎండీఎం ఏజెన్సీ నియమించడంతో పాటు, పాఠశాలలో డిప్యుటేషన్‌పై ఇద్దరు ఉపాధ్యాయులను నియమించాలని ఎంఈఓకు ఆదేశాలు జారీచేశారు. అన్ని పాఠశాలల్లో ఎండీఎంకు సంబంధించి సోమవారం నుంచి టేస్టింగ్ రిజిస్టర్ నిర్వహణతో పాటు ఒక ఉపాధ్యాయుడు ఎండీఎం పరిశీలకుడిగా వ్యవహరించాలని ఆదేశించారు.



ఆధ్యాత్మిక శోభ

గరుగుబిల్లి మండల కేంద్రంలో రామమందిరం ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం విఘ్నేశ్వర, కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని ఆధ్యాత్మిక చింతనతో గడిపారు. రామనామాన్ని స్మరించారు. ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లారు. ఈ నెల 12వ తేదీ వరకు యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్. శర్మయాజీ, గ్రామ పురోహితుడు అంబోలు కృష్ణమూర్తిశాస్త్రి పర్యవేక్షణలో పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. – గరుగుబిల్లి

'ఫ్యామిలీడాక్టర్'తో మెరుగైన వైద్యం

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగన్నాథరావు



బిటీ వాడ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జగన్నాథరావు

వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలులోకి తెచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో పల్లె ప్రజలకు మెరుగైన వైద్యసేవలు చేరువయ్యాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని బిటివాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో జనవరి నెలలో 19 ప్రసవాలు జరగగా ఇందులో 11 ప్రసవాలు ప్రభుత్వాస్పత్రిలోనే జరగడం సంతోషదాయకమన్నారు. ఉత్తమ సేవలందిస్తున్న వైద్య సిబ్బందిని అభినందించారు. గర్భిణులు, బాలింతలతో పాటు 10–19 ఏళ్లలోపు బాలికల్లో రక్తహీనత నివారణకు కృషి చేయాలని సూచించారు. బీపీ, సుగర్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆరోగ్యజాగ్రత్తలు, ఆహారపు అలవాట్లను తెలియజేయాలన్నారు. అంతకు ముందు ఓపీ, మందుల నిల్వల రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ మానస నితీషా, వై.యోగేశ్వర రెడ్డి ఉన్నారు.

వేంకటేశ్వర స్వామి సేవలో ఎమ్మెల్సీ

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి వారిని ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ శుక్రవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ పునఃనిర్మాణానికి తనవంతు కృషిచేస్తానన్నారు. దేవాలయానికి పూర్వవైభవం వచ్చేలా ఆలయ అభివృద్ధి కమిటీ కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు డి.పారినాయుడు ఉన్నారు.

తోటపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ



సారా తరలిస్తున్న ఏడుగురి అరెస్టు

సాలూరు: ఆటోలో సారా తరలిస్తున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని (మరో ముగ్గురు చిన్నారులు) పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. జీగిరాం వైపు నుంచి సాలూరు వస్తున్న ఆటోను తనిఖీచేయగా 500 సారా ప్యాకెట్లు లభించాయన్నారు.

ఆటోను సీజ్‌చేయడంతో పాటు ఏడుగురిపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఒడిశా రాష్ట్రం సుంకి నుంచి సాలూరు తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు.

రాష్ట్రానికే తలమానికంగా విశాఖ

- పరిపాలన రాజధానిగా విశాఖకు అడ్డంకులు లేకుండా చూడు స్వామీ
- రియల్ దందా కోసమే అమరావతిని నిర్మించుకున్న చంద్రబాబు
- బాబు సొంత జిల్లాలోనే లోకేశ్ పాదయాత్రకు ఆదరణ కరువు
- అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

తిరుపతి మంగళం: విశాఖ రాజధాని రాష్ట్రానికే తలమానికంగా మారుతుందని, దాంతో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పేర్కొన్నారు. తిరుమల శ్రీవారి దర్శినార్థం తిరుపతికి విచ్చేసిన ఆయన శుక్రవారం శ్రీవారి సన్నిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విశాఖపట్నం పరిపాలన రాజధాని అయిన నేపథ్యంలో ఎలాంటి అవాంతరాలు రాకుండా చూడాలని, శ్రీవేంకటేశ్వర స్వామిని ప్రార్థించానని తెలిపారు. ఆసియాలోనే అత్యంత అభివృద్ధి చెందుతున్న నగరాల్లో విశాఖ ఒకటి అని అలాంటి నగరాన్ని రాష్ట్ర రాజధానిగా చేయడంతో అభివృద్ధి శరవేగంగా జరుగుతుందన్నారు. ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు విశాఖను రాజధానిగా స్వాగతిస్తున్నారన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు తన అనుచరులు రియల్‌ఎస్టేట్ దందా చేసేందుకే అమరావతిని నిర్మించుకున్నారే తప్ప ప్రజా అవసరాల కోసం కాదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని ఆకాంక్షించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మూడు రాజధానులను ప్రకటించారని తెలిపారు. దాంతో మూడు ప్రాంతాలు ఎంతో అభివృద్ధి జరుగుతాయన్నారు.

లోకేశ్ పాదయాత్రకు ఆదరణ కరువు

14ఏళ్లు సీఎంగా ఉండి, 40ఏళ్ల రాజకీయ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు సొంత జిల్లాలోనే ఆయన తనయుడు లోకేశ్ చేస్తున్న పాదయాత్రకు ప్రజాదారణే కరువయ్యిందని డిప్యూటీ స్పీకర్ విమర్శించారు. కేవలం పక్క జిల్లాల నుంచి టీడీపీ నాయకులను పిలిపించుకుని పాదయాత్ర సాగిస్తున్నారే తప్ప ప్రజాదరణ లేదన్నారు. టీడీపీ హయాంలో చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం, ప్రజా సమస్యలను పట్టించుకోకపోవడంతో నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర అనివార్యమయ్యిందన్నారు. నేడు లోకేశ్ చేస్తున్న పాదయాత్ర కేవలం అధికార దాహంతో చేస్తున్న యాత్ర తప్ప ప్రజా సంక్షేమం కోసం కాదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల కన్నా తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కువే చేయడంతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేస్తుంటే ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు. అయితే ప్రభుత్వంపై ఎలాగైనా బురదజల్లే ప్రయత్నం చేయాలన్న ఉద్దేశంతో బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ అనే కార్యక్రమాలను చేపట్టి ప్రజల్లోకి వెళ్లిన టీడీపీ నాయకులకు ప్రజాదరణ కరువవ్వడంతో పాటు చివాట్లు పెట్టడంతో తెల్ల మొఖం వేశారన్నారు. రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి లోటు బడ్జెట్‌తో పాలన నడుస్తోందన్నారు. అప్పులు చేస్తున్నారని చెబుతున్న చంద్రబాబుకు, తన పచ్చ మీడియాలకు గత టీడీపీ హయాంలో చేసిన అప్పులు కనబడలేదా? అని ప్రశ్నించారు. అధికార దాహంతో వందల హామీలు ఇచ్చి నెరవేర్చని చంద్రబాబు సైకోనా? పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమాన్ని ఆకాంక్షించి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి సైకోనా అని ప్రశ్నించారు. లోకేశ్ పాదయాత్ర ఆడియో రిలీజ్ చేసిన అచ్చెన్నాయుడు వైఎస్సార్‌సీపీలోకి వచ్చే పరిస్థితి లేక, ఇతర పార్టీలోకి వెళ్లలేక టీడీపీలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అచ్చెన్నాయుడికి ఆ పార్టీ పైనగానీ, నాయకులపైన గానీ ఇప్పటికీ నమ్మకం లేదన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర పోటీలకు గొట్లాం విద్యార్థులు



రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బొండపల్లి: రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు గొట్లాం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు అర్హత సాధించినట్టు స్కూల్ హెచ్.ఎం శ్రీరామాచారి, పీడీ యూఎస్ సత్యానంద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ స్టేడియంలో ఇటీవల జరిగిన శాప్ ఆధ్వర్యంలో అండర్ 21 బాలురు విభాగంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. జిల్లా తరపున పోటీల్లో తమ పాఠశాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొనగా నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. స్కూల్‌కు చెందిన కె.సందీప్, బి.హరి, ఎల్.విజయదుర్గ, ఎస్.భారతి అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ నెల 11 నుండి 13 వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని చెప్పారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



చికిత్స పొందుతున్న హరికృష్ణ

పార్వతీపురం: ట్రాక్టర్‌ను వెనుక నుండి లారీ ఢీకొనడంతో గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పార్వతీపురం అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు... పార్వతీపురం నుండి కొమరాడ మండలం గంగరేగువలస గ్రామానికి ట్రాక్టర్‌పై వెళ్తుండగా ఆర్టీఓ కార్యాలయం సమీపంలో వెనుక నుంచి వస్తున్న లారీ వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ట్రాక్టర్ డ్రైవర్ హరికృష్ణ తలకు తీవ్ర గాయమైంది. ఈ మేరకు ప్రైవేటు వాహనం ద్వారా క్షతగాత్రుడును పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించారు. ఈ మేరకు హరికృష్ణకు వైద్యులు చికిత్సను అందించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అవుట్‌పోస్టు పోలీసులు తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

విజయనగరం క్రైమ్: స్థానిక కార్పొరేషన్ పరిధిలో 28వ వార్డు సచివాలయం సమీపంలో ఉన్న పరపతి వీధిలో విజిలెన్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఒక లగేజీ ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రూ.41వేల 154ల విలువ కలిగిన 1083 కిలోల పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ బి.సింహాచలం పట్టుకున్నారు. అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న పిట్ట రమణ, బియ్యాన్ని సేకరించిన బండారు ఎల్లాజీపై కేసులు నమోదు చేసి బియ్యంతో పాటూ వాహనాన్ని సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దాడుల్లో కానిస్టేబుల్ పురుషోత్తం, పౌర సంబంధాల శాఖ అధికారి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారి ఆలయ అధికారి సస్పెన్షన్

విజయనగరం టౌన్: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినందుకుగానూ ఆలయంలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న పెనుమత్స శ్రీనివాసరాజును సస్పెన్షన్ చేసినట్లు ఆలయ ఈఓ కిశోర్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తూ, విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో మెమోలు జారీ చేసినప్పటికీ అదే ధోరణితో ఉండడంతో సస్పెన్షన్ చేసినట్లు స్పష్టం చేశారు. అదే విధంగా వనంగుడి ఆవరణ చుట్టూ పెన్సింగ్ వేసేందుకు అంచనా వేస్తున్నామన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం

బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹ 190

తెలుగు రాష్ట్రాల..
ఆహ్వాన నాటిక పోటీలకు ఏర్పాట్లు పూర్తి

విజయనగరం టౌన్: నాటక శాల, అభినయ నటరత్న నాటక పరిషత్ ఆధ్వర్యంలో 7వ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు ఈ నెల 11, 12, 13 తేదీల్లో గురజాడ కళాభారతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అభినయ శ్రీనివాస్, గెద్ద వరప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక శివాలయం వీధిలో ఉన్న కార్యాలయం ఆవరణలో నాటిక పోటీల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు రోజుల పాటూ నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా 11న శనివారం సాయంత్రం 6 గంటలకు నిర్వహించే సభా కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం నిర్వహించే నాటిక పోటీల్లో కరీంనగర్ చైతన్య కళాభారతి నిర్వహించే ''చీకటి పువ్వు' అనంతరం నాటకశాల నట సేవా సమాజం, విజయనగరం ఆధ్వర్యంలో 'మహర్షి' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 12న ఆదివారం నిర్వహించే సభా కార్యక్రమానికి జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం పల్నాడు జిల్లా చిలకలూరిపేట అంజనా రాథోడ్ థియేటర్ ఆధ్వర్యంలో 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక, అనంతరం గుంటూరు సద్గురు కళానిలయం నిర్వహించే 'కమనీయం' నాటిక ప్రదర్శన ఉంటుందన్నారు. 13న ముగింపు ఉత్సవంలో అనకాపల్లి మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. అనంతరం పల్నాడు జిల్లాకు చెందిన మద్దుకూరి క్రియేషన్స్ ఆధ్వర్యంలో 'మృత్యువ్రతం' నాటిక, గుంటూరు జిల్లా కత్రపాడు ఉషోదయా కళానికేతన్ ఆధ్వర్యంలో 'ప్రక్షాళన' నాటిక ఉంటుందన్నారు. అనంతరం ఎన్టీఆర్ విశిష్ట పురస్కారాన్ని తాడేపల్లిగూడెం బీవీఆర్ కళా కేంద్రానికి చెందిన బుద్దాల వెంకట రామారావుకు ఎన్టీఆర్ విశిష్ట పురస్కారం అందజేస్తారన్నారు. వాటితో పాటూ నాటిక పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు. కళాభిమానులందరూ పాల్గొని తరించాలని కోరారు. కార్యక్రమంలో మెయిదకి చెందిన సినీ డైరెక్టర్, రైటర్ ఇజ్జరోతు శ్రీముత్యం తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అభినయ శ్రీనివాస్, గెద్ద వరప్రసాద్ తదితరులు

విశాఖ పరిపాలన రాజధానితో ఉత్తరాంధ్ర అభివృద్ధి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు

రామభద్రపురం: విశాఖను పరిపాలన రాజధాని చేయడం ద్వారా దశాబ్దాలుగా వెనుకబడి ఉన్న ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో పాల సొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ తనయుడు వివాహ శుభకార్యానికి శుక్రవారం హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు స్వగృహంలో జెడ్పీ చైర్మన్ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖలో పరిపాలన రాజధాని ఏర్పాటు చేస్తున్నారన్నారు. మూడు రాజధానుల ఏర్పాటును అడ్డుకునేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నిస్తున్నాయని, న్యాయపరమైన చిక్కులు తొలగిన మరుక్షణమే విశాఖ నుంచి పరిపాలన అందించనున్నారని తెలిపారు. విశాఖ పరిపాలన రాజధాని ఏర్పడితే విజయనగరం జిల్లా ప్రగతి పథంలో పయనిస్తుందని తెలిపారు. ఏది ఏమైనా ఏప్రిల్‌లో విశాఖ నుంచే పరిపాలన సాగే అవకాశముందని చెప్పారు.

యువగళం అట్టర్ ఫ్లాప్

యువగళం పేరిట నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర కొద్ది రోజుల్లోనే అట్టర్ ఫ్లాప్ అయ్యిందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. లోకేష్ మార్నింగ్ వాక్ చేసినా, ఈవెనింగ్ వాక్ చేసినా తగ్గుతారేమోగాని పాదయాత్రతో ఒరిగేదేమి లేదని విమర్శించారు. పాదయాత్ర జనం లేక వెలవెలబోతుందన్నారు. ఆయన వెంట జిల్లా సీనియర్ నాయకులు సూర్యనారాయణరాజు, బొబ్బిలి బుడా చైర్మన్ ప్రతినిధి ఇంటి గోపాలరావు పాల్గొన్నారు.

క్రీడా రంగం అభివృద్ధికి పెద్దపీట

- కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని రంగాలతో పాటు క్రీడారంగం అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ పేర్కొన్నారు. మండలంలోని చెల్లూరు లెప్రసీ మిషన్ ఒకేషనల్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఈశ్వర్ కౌశిక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ముఖ్యమేనని తెలిపారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం కలుగుతుందన్నారు. తల్లిదండ్రులు వారి పిల్లలను చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలన్నారు. క్రీడాకారులు పోటీల్లో జిల్లాతో పాటు రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఈశ్వర్‌కౌశిక్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హెన్నా దినకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్

13న అప్రెంటీస్ మేళా

విజయనగరం రూరల్: ఉపాధి, శిక్షణ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 13న అప్రెంటీస్ మేళా నిర్వహిస్తున్నట్లు విజయనగరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం.గోపాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో సోమవారం ఉదయం 9 గంటలకు ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ షిప్ (పీఎంఎన్ఏఎం) మేళా నిర్వహించడం జరుగుతుందని, ఈ మేళాకు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. వివిధ ట్రేడ్లలో ఐటీఐ ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు ఈ అప్రెంటీస్ మేళాకు హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అప్రెంటీస్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు రిజిస్ట్రేషన్ ఫారంతో పాటు ఆధార్ కార్డు, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణత ధ్రువపత్రాలు తీసుకు రావాలన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలుడితో పోలీసులు

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్ ఆవరణలో నవదుర్గ అమ్మవారి ఆలయం వద్ద బాలుడు తప్పిపోయి సుమారు గంట కాలం పాటు పోలీసులు, తల్లిదండ్రులకు కంగారెత్తించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. రేగిడి మండలం పెదకోడిశ గ్రామానికి చెందిన కొండేటి శంకరరావు, ఆదిలక్ష్మి దంపతులు తమ కుమారుడు జీవన్‌కుమార్‌ను అమ్మవారి ఆలయానికి శుక్రవారం అక్షరాభ్యాసానికి తీసుకువచ్చారు. అక్షరాభ్యాసం హడావుడిలో తల్లిదండ్రులు ఉన్న సమయంలో బాలుడు గుడి బయటకు వచ్చాడు. బాలునికి తల్లిదండ్రులు కనిపించకపోవడంతో ఏడ్చుకుంటూ వెళుతుండగా స్థానికులు గమనించి మెయిన్ రోడ్డుపై ఉన్న పోలీసులకు సమాచారం అందించారు. వారు బాలుడిని దగ్గరకు తీసుకుని తల్లిదండ్రులను వెతికే పనిలో నిమగ్నమయ్యారు. ఇంతలో బాలుని తల్లిదండ్రులు కూడా తమ కుమారుడు కనిపించడం లేదంటూ కంగారు పడుతూ వెతుకులాట ప్రారంభించారు. అంబేడ్కర్ జంక్షన్‌లో బాలుడుని చూసి దగ్గరకు వెళ్లిన తల్లిదండ్రులను పోలీసులు ఆరా తీశారు. తమ కుమారుడుగా నిర్ధారించుకుని అప్పగించారు. తమ కుమారుడిని అప్పగించిన పోలీసులకు బాలుని తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

బొద్దాం పాఠశాల ఆకస్మిక తనిఖీ



బొద్దాం పాఠశాలలో విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

రాజాం సిటీ: మండల పరిధి బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులన్నీ కలియతిరిగి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అడిగి తెలుసుకుని హాజరు పట్టి పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న ఫార్మెటివ్ ఎసెస్‌మెంట్ - 3 పరీక్షలకు విద్యార్థులు హాజరు శాతం తక్కువగా ఉండడానికి కారణమేమిటని హెచ్‌ఎం గురుమూర్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పాఠశాల వాతావరణం బాగోలేదని తెలిపారు. విద్యార్థుల గ్రేడింగ్ కూడా అంతంత మాత్రమేనని, పరీక్షల సమయంలో విద్యార్థులు హాజరుశాతం తక్కువగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. పరీక్షలు దగ్గర పడుతున్న సమయంలో విద్యాప్రమాణాలు మెరుగుపర్చకపోతే ఎలా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అధ్వాన్నంగా ఉన్న పాఠశాల పరిస్థితులు, విద్యార్థుల గ్రేడింగ్‌కు సంబంధించి హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసు ఇవ్వనున్నామని అన్నారు. ఆయనతో పాటు ఎంఈఓ పి.నాగయ్య తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు 72 పోలింగ్ కేంద్రాలు

- కలెక్టర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి స్థానం కోసం మార్చి 13న ఎన్నిక జరగనుందని దీని కోసం జిల్లాలో అదనంగా 8 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. జిల్లాలో ఈ ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని దీనికి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ తన చాంబర్‌లో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని చెప్పారు. కొన్ని పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఓటర్ల సంఖ్య 1,400 కంటే ఎక్కువగా ఉండటం వల్ల అదనంగా 8 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గత ఎన్నికల్లో 64 కేంద్రాలు ఉండగా ఈ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల సంఖ్య 72కు చేరిందని తెలిపారు. రాజాంలో 1, బొబ్బిలిలో 2, విజయనగరంలో 2, ఎస్.కోటలో 2, ఎల్.కోటలో 1 చొప్పున పోలింగ్ కేంద్రాలు పెరుగుతున్నాయని చెప్పారు. బొబ్బిలి, విజయనగరం, ఎస్.కోటల్లో ఒక్కో పోలింగ్ కేంద్రంలో చిన్నపాటి మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ ఎమ్మెల్సీ స్థానం ఎన్నికకు సంబంధించి నామినేషన్లు, స్క్రూటినీ, ఉపసంహరణ, లెక్కింపు తదితర ప్రక్రియలన్నీ విశాఖపట్నంలోనే జరుగుతాయని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తామని చెప్పారు. ఓటర్ల జాబితాల్లో తప్పులు దొర్లకుండా డూప్లికేషన్ లేకుండా కచ్చితమైన జాబితాను తయారు చేస్తామని చెప్పారు. జిల్లాలో ఎన్నిక ప్రక్రియను సజావుగా ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను కలెక్టర్ నివృత్తి చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ ఎం.గణపతిరావు మాట్లాడుతూ ఎన్నిక షెడ్యూల్‌ను వివరించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, సీపీఐ, సీపీఎం పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం అధికారులు, వివిధ మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఏపీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా అప్పారావు

విజయనగరం టౌన్: ఏపీఎస్‌ఆర్టీసీ విజయనగరం జోనల్ వర్కుషాపులో పని చేస్తున్న డి.అప్పారావు వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. కమిటీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్యలు ఎంపికలో పాల్గొన్నారన్నారు. ఈ మేరకు ఆర్టీసీ స్టేట్ చైర్మన్ మల్లిఖార్జునరెడ్డిని ఆయన చాంబర్‌లో కలిశామన్నారు. ఆర్టీసీని ప్రభుత్వం విలీనం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రికి తామంతా రుణపడి ఉన్నామన్నారు. ఆర్టీసీ అభివృద్ధికి వైఎస్సార్ అసోసియేషన్ కట్టుబడి ఉందన్నారు. అప్పారావు ఎంపిక పట్ల జోనల్ వర్క్‌షాపు, డిపో పరిధిలో ఉన్న వైఎస్సార్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు.



ఆర్టీసీ స్టేట్ చైర్మన్ మల్లిఖార్జునరెడ్డిని మర్యాపూర్వకంగా కలిసిన అప్పారావు

ప్రెస్ క్లబ్ నిర్వహణకు తాత్కాలిక కార్యవర్గం



విజయనగరం ప్రెస్‌క్లబ్ తాత్కాలిక కార్యవర్గం

విజయనగరం అర్బన్: విజయనరగం ప్రెస్ క్లబ్ కార్యకలాపాల నిర్వహణకు సంబంధించిన తాత్కాలిక కార్యవర్గం ఎంపిక ప్రక్రియ శుక్రవారం స్థానిక నెహ్రూ యువ కేంద్రంలో జరిగింది. పట్టణ పరిధిలో పని చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్, చిన్న మధ్య తరహా పత్రికల విలేకరులు, వీడియో గ్రాఫర్లు, ఫొటో గ్రాఫర్లు, లోకల్ కేబుల్ టీవీ ఛానెళ్ల కేటగిరిల నుంచి 21 మంది సభ్యులతో కూడిన నూతన కార్యవర్గాన్ని సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో జరిగింది. మీడియా మిత్రులకు అన్ని విధాలా అండగా ఉంటూ, సంక్షేమ సహాయ సహకారాలు అందించే విషయంలో అందరూ కలిసికట్టుగా ముందుకెళ్లి ప్రెస్ క్లబ్ ద్వారా మీడియా మిత్రులందరికీ అండగా తీర్మానించుకున్నారు.

తాత్కాలిక కార్యవర్గం సభ్యులు వీరే

ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గంలో పీఎస్ శివప్రసాద్ (దూరదర్శిని), అల్లు సూరిబాబు (సాక్షి, బ్యూరోచీఫ్), బూరాడ శ్రీనివాస్, ఎంఎంఎల్‌నాయుడు, వర్రి వెంకట జగన్నాథం (ఎన్‌టీవీ బ్యూరో), కె.శేఖర్ (సత్యా విజన్), కె.రమేష్‌నాయుడు (ప్రజాశక్తి), బీజీఆర్ పాత్రో (ఆంధ్రప్రభ), వీమహాపాత్రో, బీ.శ్రీనివాస్, కె.శ్రీనివాసులు, పంచాది అప్పారావు, అవనాపు సత్యనారాయణ, వీఎంకే లక్ష్మణరావు (నిజం పత్రిక బ్యూరో), ఎంఎస్ఏస్‌రాజు, జయరాజు, రవిచంద్రశేఖ్, గొర్లె సూరిబాబు, కరీం, ఆర్.ఈశ్వర్ (సాక్షి టీవీ కెమెరామెన్), డి.సత్యనారాయణ (సాక్షి ఫొటోగ్రాఫర్) ఉన్నారు. సమావేశంలో జిల్లా సమాచార అధికారి డి.రమేష్, ఏపీఆర్‌ఓ డి.నారాయణరావు, ఏవీఎస్ సత్యనారాయణ రావు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, చిన్న మధ్యతరహా పత్రికలు, పీరియాడికల్స్ నుంచి పలువురు జర్నలిస్టులు, కెమెరామెన్లు, ఫొటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.

కట్నం ఇవ్వలేదని దాడి

పార్వతీపురం: పట్టణంలోని బంధం వారి వీధిలో స్కూటీపై మార్కెట్‌కు వెళ్తున్న కుర్మాన అన్నపూర్ణ, సురేష్‌కుమార్‌పై స్టీల్ రాడ్లతో అల్లుడు జి.ప్రతాప్, బాలు, ప్రమోద్‌లు శుక్రవారం దాడి చేశారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న ప్రతాప్ కట్నం ఇవ్వలేదని అన్నపూర్ణ, సురేష్‌లపై స్టీల్‌రాడ్‌తో దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ప్రైవేటు వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రురాలు

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

- జిల్లా ప్రజా రవాణా అధికారి సుధాకర్

పార్వతీపురం టౌన్: శివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని జిల్లా నుండి వేర్వేరు ప్రాంతాలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామని జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ అన్నారు. శుక్రవారం స్థానిక డీపీటీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 18 , 19 తేదీల్లో పార్వతీపురం, సాలూరు, పాలకొండ డిపోల నుంచి 63 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

డిపోల వారీగా బస్సులు ఇలా..

- పార్వతీపురం డిపో నుంచి పార్వతీపురం - గుంప గ్రామానికి మధ్య 45 బస్సులు, చార్జి రూ.25.
- సాలూరు డిపో నుంచి సాలూరు - పారమ్మకోండకు 50 బస్సులు, చార్జి రూ. 20.
- పాలకొండ డిపో నుంచి రాజాం - చీపురుపల్లి మధ్య 6 బస్సులు, చార్జి రూ. 30.
- పాలకొండ డిపో నుంచి చీపురుపల్లి - రామతీర్థాల మధ్య 14 బస్సులు, చార్జి రూ. 30.

పట్టుబడిన గొలుసు దొంగలు

- రాయగడలో వరుస చోరీ కేసులను ఛేదించిన పోలీసులు
- 49 గ్రాముల బంగారం స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మల్లిక్, వెనుక నిందితులు



బాధితుడు బక్షీపాత్రోకు చోరీ సొత్తును అందిస్తున్న ఐఐసీ ప్రధాన్

రాయగడ: గత కొద్ది రోజులుగా పట్టణంలో చోటు చేసుకున్న వరుస గొలుసు దొంగతనాల కేసులను పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 49గ్రాముల బంగారం, 2 ద్విచక్ర వాహనాలు, 5 సెల్‌ఫోన్లు, రూ.48 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సుధాం మల్లిక్, సదర్ పోలీస్ స్టేషన్ ఐఐసీ రస్మిరంజన్ ప్రధాన్ శుక్రవారం మీడియాకు వెల్లడించారు. అరెస్టయిన వారిలో జిల్లాలోని లక్ష్మీపూర్ సమితి మందులగుడ గ్రామానికి చెందిన సుదర్శన్ కంధపాణి(24), కల్యాణ సింగుపూర్ సమితి అడాబడి గ్రామానికి చెందిన యుధిష్టర్ కౌసల్య(24), రాయగడలోని పయికోవీధికి చెందిన బండి శంకరరావు(58), కాసీపూర్‌కు చెందిన శంకర్‌నాయక్(21), ఆంధ్రప్రదేశ్ మన్యం జిల్లా పార్వతీపురంలోని మక్కువకు చెందిన పి.సూర్యనారాయణ(29), టికిరి సమితిలోని మధు భోరా(29) ఉన్నట్లు గుర్తించారు. ఫిబ్రవరి ఒకటిన రాయగడ ఆర్‌కే నగర్‌లో నివాసముంటున్న వృద్ధురాలు సంజుక్త బక్షిపాత్రో జగన్నాథ మందిరానికి వెళ్లి వస్తుండగా ట్రెజరీ కార్యాలయం సమీపంలో బైకుపై వచ్చిన దుండగులు ఆమె మెడలోని 36 గ్రాముల బంగారు గొలుసును అపహరించారు. దీనిపై బాధితురాలి కుమారుడు గోపరంజన్ బక్షిపాత్రో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఫిబ్రవరి 6న ఇందిరానగర్‌కు చెందిన వి.తిరుపతి రాజు మెడలోని చైన్‌ను తెంపుకెళ్లారు. దీనితో పాటు 2022 జూలై 16న రాయగడ సాయిప్రియ నగర్‌లో గొలుసు దొంగతనం కేసుకు సంబంధించి చేపట్టిన దర్యాప్తులో నిందితులంతా ఒకే ముఠాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వారిని అరెస్ట్ చేసి, 49గ్రాముల బంగారాన్ని రికవరీ చేశారు. స్వాధీనం చేసుకున్న బంగారాన్ని ఐఐసీ రస్మిరంజన్ ప్రధాన్ సమక్షంలో బాధితులకు అందజేశారు.

ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: ఆటోను ఢీకొన్న ఘటనలో పలువురికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. అవుట్‌పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు.. జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన రెడ్డి రమాదేవి, ఎస్.గౌరీశ్వరీ, జి.అప్పలనరసమ్మ, జి.పార్వతమ్మ పార్వతీపురం మండలం ఎమ్మార్‌నగరం బంధువుల పరామర్శకు వెళ్లారు. తిరిగి పార్వతీపురం నుండి కన్నపుదొరవలస వెళ్తున్న సమయంలో నందివానివలస, గిజబ గ్రామాల మధ్య వున్న ఎల్లమ్మ తల్లి గుడి సమీపంలో నీలకంఠాపురం నుండి పార్వతీపురం వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో వున్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు చినమేరంగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. మరింత మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 అంబులెన్స్ ద్వారా తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు అవుట్ పోస్టు పోలీసులు తెలిపారు.